సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 1 । మార్చి । 2025



సోమశిలలో 59.275 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 59.275 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 401 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.87,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,949
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,187
నవర (8 గ్రాములు)	రూ.65,496

గరిష్టం/కనిష్టం 32.7 /23.6

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

విధుల నుంచి ఇద్దరు ఎఫ్ఎన్ఓల తొలగింపు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో పనిచేస్తూ దొంగతనానికి పాల్పడి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఇద్దరు ఎఫ్ఎన్ఓలను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ డీఎంహెచ్ఓ వి.సుజాత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. యల్లాయపాళెం పీహెచ్‌సీ ఎఫ్ఎన్ఓ దార్ల జీవిత, సర్వాయపాళెం పీహెచ్‌సీ ఎఫ్ఎన్ఓ వాసుకిలు ఆప్కాస్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిద్దరూ కోవూరు మండలం పాటూరు రోడ్డులో గురువారం రాత్రి ఓ వృద్ధురాలి నుంచి బంగారు చైన్ చోరీ చేస్తూ పట్టుబడ్డారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అందువల్ల వీరిని ఉద్యోగాల నుంచి తొలగించామని తెలిపారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వకేట్ యాక్ట్ 2025 బిల్లును వ్యతిరేకిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త బిల్లును పునః పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. న్యాయవాదులందరు తమ ఆందోళన విరమించి విధులకు హాజరు కావాలని కోరారు. బార్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులూ.. విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 79 కేంద్రాల ఏర్పాటు




ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్ఐఓ

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 79 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను అరగంట ముందుగా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 53,200 మంది హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 28,176 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 25,024 మంది ఉన్నారు. కోవూరు, తోటపల్లిగూడూరు, బిట్రగుంట, మర్రిపాడు, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, కుల్లూరు, చేజర్ల, పొదలకూరు, బుచ్చిరెడ్డిపాళెం, అల్లూరు ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. హాల్‌టికెట్లను బోర్డు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని హాజరుకావొచ్చు. దానిపై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం ఉండాల్సిన అవసరం లేదు. విద్యార్థుల సమస్యలు, ఇబ్బందుల కోసం కంట్రోలు రూమ్‌ను ఏర్పాటు చేశారు. 0861 – 2320312 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలి. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా నాలుగు ఫ్లయింగ్, 5 సిటింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 1,400 మందికి పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు సూచించారు.

నేడు పింఛన్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. శనివారం జిల్లా వ్యాప్తంగా 3,07,232 మంది లబ్ధిదారులకు రూ.132 కోట్ల నగదును పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి సచివాలయాల ద్వారా నగదును సిబ్బందికి అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి నగదు పంపిణీ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

ఇసుక మోసిన విద్యార్థులు



దుత్తలూరు: దుత్తలూరులోని ఏపీ మోడల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల చేత ఇసుక బస్తాలు మోయించారు. స్కూల్లో సరస్వతీదేవి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుబయట ఉన్న ఇసుకను బస్తాల్లోకి నింపి లోపలికి మోయించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని గురించి ప్రిన్సిపల్ సైమన్‌రావును వివరణ కోరగా తాము విద్యార్థులకు ఎటువంటి పని చెప్పలేదని, వారే స్వయంగా తీసుకొచ్చారని తెలిపారు.

ఒరిగింది శూన్యం

నిరుద్యోగుల ప్రస్తావన లేదు



నిరుద్యోగుల ప్రస్తావన లేకుండా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టడం బాధాకరం. ఇచ్చిన హామీలు మరిచారు. నిరుద్యోగ భృతికి కేటాయింపులు జరపలేదు. ఉచిత బస్సు హామీ మాటే లేదు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇప్పటి వరకు ఇవ్వలేదు. లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

– కె.దేవిక, డీఎడ్ విద్యార్థిని, వావిలేటిపాడు

సూపర్‌సిక్స్ హామీలు గాలికేనా



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. సూపర్‌సిక్స్ హామీలు గాలికి వదిలేసినట్లుగా ఉంది. సాగునీటి ప్రాజెక్ట్‌లకు సంబంధించి దేనికి ఎంత మంజూరో తెలియని పరిస్థితి. జిల్లాలోని సోమశిల ప్రాజెక్ట్ అభివృద్ధి, ముఖ్యమైన హైలెవల్ కెనాల్ పనులు ప్రశ్నార్థకమయ్యాయి. బడ్జెట్ ఆశాజనకంగా లేదు.

–షేక్ సందానీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఆత్మకూరు

నేతన్నలకు రిక్తహస్తం



రాష్ట్ర బడ్జెట్లో చేనేతలకు కూటమి ప్రభుత్వం రిక్తహస్తం చూపింది. కేవలం మగ్గం ఉన్న వారికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందజేస్తామని ప్రకటించారు. చేనేతపై ఉన్న జీఎస్టీని తొలగిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదు. బడ్జెట్లో చేనేతలకు రూ.2 వేల కోట్లు కేటాయించి ఆదుకోవాలి.

– పముజుల శంకరయ్య, అఖిలభారత చేనేత సంఘం నాయకుడు, పొదలకూరు

- బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి
- నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు
- పింఛన్‌దారులకు కష్టకాలమే.
- కలరింగ్ ఎక్కువ.. కంటెంట్ తక్కువ
- బడ్జెట్‌పై ప్రజల అసంతృప్తి

సాక్షిప్రతినిధి, నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో జిల్లాకు మొండి చేయి మిగిలింది. రూ.3.22 లక్షల కోట్లతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 'కలరింగ్ ఎక్కువ.. కంటెంట్ తక్కువ' అన్న రీతిలో ఉందని జిల్లాలోని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రధానంగా పొదుపు మహిళలు, కౌలు రైతులు, నిరుద్యోగులు, పింఛనుదారులు వీరంతా నష్టపోతున్నారు. జిల్లాలోని పెన్నా డెల్టాకు, తెలుగుగంగ ప్రాజెక్టు, సోమశిల–స్వర్ణముఖి కెనాల్‌కు ఆశించిన మేర నిధులు కేటాయించలేదు. అరకొరగా కేటాయించి చేతులు దులుపుకొన్నారు. అది మినహా జిల్లాకు ఒరిగిందేమి లేదు.

సున్నా వడ్డీ ఊసేలేదు


జిల్లాలో 39,358 పొదుపు గ్రూపులున్నాయి. వీటిలో 4,02,729 మంది సభ్యులున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వీరికి సున్నా వడ్డీ కింద రూ.188 కోట్లు అందజేసింది. నేటి బడ్జెట్‌లో సున్నా వడ్డీ ఊసే లేకపోవడంతో పొదుపు మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారు.

పింఛన్లకు కోత

జిల్లాలో పింఛన్‌దారులు 3.7 లక్షల మంది ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.132 కోట్లు పింఛన్ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే బడ్జెట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.27,500 కోట్లు పింఛన్‌దారుల కోసం కేటాయించారు. ఇప్పుడు ఇస్తున్న లెక్కల ప్రకారమే రాష్ట్రంలో రూ.32,628 కోట్లు పింఛన్‌కు ఖర్చవుతోంది. అంటే రూ.5,128 కోట్ల మేర కోత వేయబోతున్నారు.

తల్లికి వందనంలో మతలబు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూన్ 2024కు పరిశీలిస్తే రాష్ట్ర వ్యాప్తంగా 43,96,000 మంది విద్యార్థులకు రూ.6,590 కోట్లు అమ్మఒడి కింద ఇచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెప్పినట్టు 1 నుంచి 12వ తరగతి వరకు ఎంతమంది విద్యార్థులు చదువుతుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి. విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే 87.41 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ తల్లికి వందనం నిధులివ్వాలంటే రూ.13 వేల కోట్లకు పైగా ఇవ్వాలి. అయితే బడ్జెట్‌లో కేటాయింపులు రూ.9,407 కోట్లుగా పేర్కొన్నారు. అంటే వేలాది మందికి తల్లికి వందనం సొమ్ముకు ఎగనామం పెట్టనున్నారు.



బడ్జెట్ సంతృప్తికరంగా లేదు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సంతృప్తికరంగా లేదు. విద్య, వైద్యం, రైతు, యువతకు గత బడ్జెట్‌తో పోల్చుకుంటే ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. గత ప్రభుత్వం ధరల స్థిరీకరణకు రూ.3,000 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం. జలాశయాల అభివృద్ధికి అరకొరగా నిధులు కేటాయింపులు చేశారు.

– కాకు వెంకటయ్య, రైతు నాయకుడు, ఉదయగిరి

పాఠశాల విద్యకు ఇంతేనా?



బడ్జెట్‌లో రాష్ట్ర పాఠశాల విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి. 2025–26కి బడ్జెట్‌లో పాఠశాల విద్యాశాఖకు 9.86 శాతం నిధులు కేటాయించడం సరికాదు. ఈ నిధులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఏ మాత్రం సరిపోవు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌కు కావాల్సిన తరగతి గదులు, వసతులు కోసం బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించలేదు.

– నవ కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

తల్లికి వందనం అమలు చేయాలి



కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలి. 2024–25 విద్యా సంవత్సరానికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పీఆర్సీ, ఐఆర్ గురించి ప్రస్తావన లేకపోవడం బాధాకరం. నాడు – నేడు కింద పూర్తి చేయాల్సిన పాఠశాలల కోసం నిధులు కేటాయించాల్సి ఉంది.

– సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్

పీఆర్సీ ప్రస్తావన ఏదీ?



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇచ్చి ఉండాల్సి ఉంది. కనీసం బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయిస్తే తప్ప విద్యారంగం బలోపేతం కాదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ, ఆర్థిక బకాయిల చెల్లింపు ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరం. నాడు-నేడులో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసే విధంగా నిధుల కేటాయింపులు లేవు.

– మోహన్‌దాస్, సీనియర్ నాయకులు, ఏపీటీఎఫ్

నిరుద్యోగ భృతి ఎక్కడ?

ఎన్నికల హామీలో భాగంగా టీడీపీ నిరుద్యోగ భృతి కల్పిస్తామంది. జిల్లాలో సుమారు లక్ష మంది నిరుద్యోగులు డిగ్రీలు చేతబట్టుకుని ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు వీరికి నిరుద్యోగ భృతి కింద బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. ఆ ఊసేలేదు. 18 ఏళ్ల వయసు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. ఈ హామీకి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

జిల్లాలో నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం లేదు

జిల్లాలో ఆత్మకూరు సమీపంలోని నారంపేట వద్ద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టారు. అక్కడ కొంత మేరకు పనులు జరిగాయి. ప్రభుత్వం మారింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆటో కార్మికులు, మత్స్యకారులు, కాయకష్టం చేసుకునే కూలీలు ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా లబ్ధిపొందేవారు. ఇప్పుడు అన్నీ ఆగిపోయాయి.

టీడీపీ నేత ఆధ్వర్యంలో పేకాట శిబిరం

- రోజువారీగా రూ.లక్షలు చేతులు మారుతున్న వైనం
- కొడవలూరు మండల టీడీపీ నేత నిర్వాకం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

నెల్లూరు టాస్క్‌ఫోర్స్: కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండల స్థాయి టీడీపీ నేత పేకాట శిబిరం నిర్వహిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీడీపీ నేతలు మద్యం తాగుతూ పేకాట ఆడుతున్న వీడియో వైరల్ కావడం చర్చనీయాంశమైంది. నార్తురాజుపాళెనికి చెందిన టీడీపీ నేత జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనధికార పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. జిల్లా నలుమూలల నుంచి జూదరులు వచ్చి అక్కడ మూడు ముక్కలాడుతున్నారు. నిత్యం రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేత రెండేళ్ల క్రితం అనధికార పేకాట శిబిరం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అయినా మార్పురాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ యథేచ్ఛగా పేకాట శిబిరం నిర్వహిస్తూ ఆదాయ వనరులుగా మార్చుకున్నాడు.

రోజూ ప్లేస్‌లు మార్చేస్తూ..

ఈజీ మనీకి అలవాటు పడిన సదరు టీడీపీ నేత నియోజకవర్గంలోని కొడవలూరు, యల్లాయపాళెం ప్రాంతాల్లో అనధికార పేకాట శిబిరాలను నిర్వహించేవాడు. కానీ ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ప్లేస్‌లు మార్చేస్తూ మూడు ముక్కలాటతో సొమ్ము చేసుకుంటున్నాడు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఓ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వీడియోను కొందరు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అక్కడే మద్యం తాగుతూ, డ్యాన్స్‌లు చేస్తూ, పేకాట ఆడుతున్న వీడియో పెద్ద దుమారమే రేపింది.

కమీషన్లతో రూ.లక్షల్లో ఆదాయం

ఈ అనధికార పేకాట శిబిరం నిర్వహణ కోసం పేకాట రాయుళ్లు సదరు టీడీపీ నేతకు 20 శాతం కమీషన్ సమర్పించాలి. ఆటలో కూర్చోవాలంటే ముందుగా రూ.5,000 కట్టాలి. ఆపై పెట్టే ప్రతి రూపాయిలో 20 శాతం ముందుగానే తీసుకుని టోకెన్లు ఇస్తారు. ఆ టోకెన్లు ఉంటేనే ఆడాలి. ఇలా రోజువారీ టీడీపీ నేతకు రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది.




పేకాట శిబిరంలో జూదరులు

ఉద్యోగాల పేరుతో టోకరా

- నకిలీ ఉత్తర్వుల అందజేత
- ఏకంగా డీఎంఈ సంతకం ఫోర్జరీ
- ఒక్కో ఉద్యోగానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వసూలు
- పెద్దాస్పత్రిలోని ఓ చిరుద్యోగి నిర్వాకం
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

నెల్లూరు(అర్బన్): అతను అటెండర్ స్థాయి ఉద్యోగి. రాష్ట్ర ఉన్నతాధికారుల పేరుతో ఫోర్జరీ సంతకాలు చేసి నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో (పెద్దాస్పత్రి) నియమిస్తూ ఉద్యోగ ఉత్తర్వులు కూడా అందజేశాడు. వాటిని నిజమైనవిగా భావించిన నిరుద్యోగులు పెద్దాస్పత్రికి వెళ్లారు. తీరా తాము మోసపోయామని తెలిసి లబోదిబోమంటున్నారు. మోసం చేసింది ఎవరో కాదు.. పెద్దాస్పత్రిలో సర్జికల్ విభాగంలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగి మురళి.

నెల్లూరు పొదలకూరు రోడ్డులో నివసిస్తున్న జాన్ అనే వ్యక్తి కొత్తూరు వద్ద కరెంటాఫీస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ ఇటీవల రిటైరయ్యారు. పెద్దాస్పత్రిలో పనిచేసే మురళి ఆయనతో పరిచయం పెంచుకున్నాడు. ఆరు నెలల క్రితం జాన్ కుమార్తె షారోన్ మాధురికకు ల్యాబ్ టెక్నీషియన్‌గా కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రూ.1.50 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లిస్తే సరిపోతుందని నమ్మబలికాడు. జాన్ పలుదఫాలుగా ఫోన్‌పే ద్వారా మురళికి నగదు పంపాడు. అలాగే తన తమ్ముడు కుమార్తె హారికకు ఉద్యోగం కోసం రూ.75 వేల వరకు మురళికి ఇప్పించాడు. డబ్బులిచ్చాక ఉద్యోగం ఎక్కడని ప్రశ్నించడంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి పేరుతో దొంగ సంతకం చేసి 2024 నంబర్ ఒకటో తేదీన ఉద్యోగమిస్తూ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులిచ్చాడు. మొత్తం 8 మందికి ఉద్యోగాలిస్తూ ఫేక్ లెటర్లు ఇచ్చాడు. వాటిని నిజమని నమ్మి పెద్దాస్పత్రికి వెళ్లగా ఇక్కడ ఖాళీల్లేవని ఎవరో మోసం చేశారని అధికారులు చెప్పడంతో అప్పటికి గాని తాము మోసపోయినట్లు జాన్ సోదరులకు తెలియలేదు. దీంతో వారు డబ్బుల కోసం మురళిపై ఒత్తిడి తెచ్చారు. అతను తప్పించుకుని తిరగడంతో నాలుగో నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మురళిని పిలిపించారు. అతని తల్లి అక్కడకు వచ్చి తన బిడ్డను వదిలేయాలని, ఆ డబ్బు తాను చెల్లిస్తానని బతిమాలుకుంది. దీంతో జాన్ సోదరులు రాజీపడి డబ్బుల కోసం ఎదురు చూడసాగారు. స్పందన లేకపోవడంతో మురళి కోసం శుక్రవారం జాన్ పెద్దాస్పత్రికి వచ్చాడు. మోసాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తెలిపాడు.



ఉద్యోగాలు కల్పిస్తూ ఇచ్చిన ఫేక్ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు

ఎనిమిది మందికి..

ఆరుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఒకరికి ల్యాబ్ టెక్నీషియన్‌గా, మరొకరికి అటెండర్‌గా మురళి ఉత్తర్వులిచ్చాడు. అందులో రిజర్వేషన్, ఆధార్ నంబర్లు, జీతం స్కేల్ పొందుపరుస్తూ దొంగ ఉత్తర్వులు ఇవ్వడం విశేషం. వారిలో ఎస్‌కే రేష్మ, కె.కలీమ్, ఎస్‌కే వశీం అహ్మద్, ఎ.షారోన్ మాధురిక, కామాటి అనూష, జొన్నవాడ షాలీము, ఎం.నాగసుమతి, టి.నరేంద్ర తదితరులున్నారు. తమను మోసం చేశాడని తెలుసుకున్న కొంతమంది నిరుద్యోగులు మురళిపై ఒత్తిడి తెచ్చి డబ్బు తిరిగివ్వాలని డిమాండ్ చేయసాగారు. మరో వైపు ఈ కథ పోలీసులకు చేరింది. దీంతో మురళి పెద్దాస్పత్రి విధులకు రావడం మానేశాడు. తప్పించుకుని తిరుగుతున్నాడు. అమాయకులను మోసం చేసి సుమారు రూ.15 లక్షల వరకు దండుకున్నాడనే ప్రచారం పెద్దాస్పత్రిలో జరుగుతోంది.

"విచారణ చేస్తున్నాం"

ఉద్యోగాలు కల్పిస్తామంటూ డబ్బులు వసూలు చేయడం, డీఎంఈ పేరుతో దొంగ ఉత్తర్వులు సృష్టించినట్టు ఫిర్యాదు అందింది. విచారణ చేస్తున్నాం. డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. – డాక్టర్ సిద్ధానాయక్, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్